ప్రజాశక్తి

శుక్రవారం 3 జనవరి 2025 | 5 | అనంతపురం

సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని మెచ్చిరి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కాలవ పాల్గొని మాట్లాడారు. గ్రామా ల్లో పొలం సరిహద్దులు, గట్ల సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండా రెవెన్యూ అధికారులే గ్రామాలకు వచ్చి పరిష్కరించేందుకు ప్రభుత్వం సదస్సులు ఏర్పాటు చేస్తోంద న్నారు. భూ యజమానులకు సంపూర్ణ హక్కు, అధికారం కల్పిస్తారన్నారు. రైతులు అర్జీలో పేర్కొన్న వివరాలపై రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. గతంలో భూముల రీ సర్వే అసంపూర్తిగా జరిగిందని, దీంతో రుణాల మంజూరుకు ఇబ్బందులు ఎదురయ్యేవన్నారు. పేదల కోసం సిఎం చంద్రబాబు చేస్తున్న మంచి కార్యక్రమంపై గ్రామాల్లో చర్చ జరగాలని సూచించారు. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. అర్హులకు కొత్తగా రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయడతో పాటు పక్కా ఇళ్లు నిర్మిస్తామన్నారు. సదస్సులో తహశీల్దార్ నాగరాజు, టిడిపి మండల కన్వీనర్ హను మంతు, నాయకులు సదాశివరెడ్డి, టంకసాల హనుమంతు, సోము, బట్టి తిప్పేస్వామి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా

అనంతపురం కార్పొరేషన్ : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అనంతపురంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు సిఐటియు నాయకులు తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం రూ.21వేలు వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికులకు నాలుగేళ్లుగా ఉన్న బకాయి సరెండర్ లీవ్‌లు ఇవ్వాలని, గత సమ్మె హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి శుక్రవారం నిర్వహించనున్న ధర్నాలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, ఇంజినీరింగ్ రాష్ట్ర నాయకులు సంజీవరాయుడు, నగర అధ్యక్షులు బండారి స్వామి, పర్మినెంట్ యూనియన్ నగర అధ్యక్షులు ముత్తురాజు, ఇంజినీరింగ్ నగర అధ్యక్షులు ఓబుళపతి, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, పోతులయ్య, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పేరుకే ఓడీఓపీ..!

- వేరుశనగ రైతుకు దక్కని భరోసా
- ప్రత్యేక ప్రయోజనాలు శూన్యం
- వేరుశనగ అమ్మకానికి మార్కెట్ కరువు

ఓడీఓపీ (వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్టు) కింద అనంతపురం జిల్లాలో వేరుశనగ పంటను ఎంపిక చేశారు. ఎంపిక వరకు బాగానే ఉన్నా దీని వల్ల వేరుశనగ సాగు చేసే రైతుకు ఏ మేరకు ప్రయోజనం చేకూరిందన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానం వలన ఇప్పటి వరకు అదనపు ప్రయోజనం పెద్దగా లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుకు అందుతున్న ప్రత్యేక రాయితీలుండటం లేదు...గిట్టుబాటు ధరకు కల్పిస్తున్న అదనపు సౌకర్యాలూ లేవు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో వేరుశనగ పంట సాగవుతుంది. విడిపోయిన అనంతపురం జిల్లాలో ఐదు లక్షల ఎకరాలకుపైగానే వేరుశనగ పంట సాధారణంగా సాగవుతుంది. ఇందులో అత్యధికం వర్షాధారంపైనే ఉంటుంది. ఇంత పెద్దఎత్తున ఈ పంటసాగవుతున్న నేపథ్యంలో ఒడిఒపి కింద దీనిని ఎంపిక చేశారు. ఈ రకంగా ఎంపిక చేసిన జిల్లాలో ఆ పంటల సాగుతోపాటు, ఉత్పత్తులకు అదనపు విలువ కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇది 2022కు ముందే ప్రకటించారు. కొద్ది రోజులు దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తరువాత దీని ఊసే కనిపించడం లేదు. రైతు పండించిన పంటకు అదనపు విలువ కల్పించడం, ఎగుమతులు జరిగే విధంగా ప్రోత్సహించి, రైతుకూ అదనపు ప్రయోజనం చేకూర్చడం ఒడిఒపి ప్రధాన లక్ష్యం. ఇప్పటి వరకు చూస్తే ఒకటి, రెండు స్వచ్ఛంద సంస్థలు మాత్రమే రైతుకు వాల్యు ఎడిషన్ చేసే కార్యక్రమాలు చేపడుతున్నాయి.

ఇప్పటికీ మార్కెట్ సౌకర్యం కరువు

పెద్దఎత్తున వేరుశనగ సాగయ్యే అనంతపురం జిల్లాలో స్థానికంగా వేరుశనగ మార్కెట్ లేదు. పంట పండితే రైతు కర్నాటకలోని బళ్లారి మార్కెట్‌కు తీసుకుపోవాలి. లేదా వ్యాపారులే వచ్చి పంటను కొనుగోలు చేయాల్సి ఉంది. ఇలా కొనుగోలు చేసే సమయంలో వ్యాపారులు చెప్పిందే ధరగా ఉంటోంది. రైతుకు మరో మార్గం లేక పంటను అమ్మేసుకోవాల్సి ఉంటోంది. వేరుశగ రైతులకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించడంలో మాత్రం ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది.

మద్దతు ధర కల్పిస్తేనే ప్రయోజనం

చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

పాలకుల మాటలు కోటలు దాటుతున్నాయి. ఆచరణ మత్రం గడప దాటలేదు. పేరుకే ఓడీఓపీ ప్రకనలు చేస్తున్నారు. అందుకు అనుగుణమైన చర్యలు తీసుకోవడం లేదు. కనీసం ఇప్పటి వరకు మార్కెట్ సౌకర్యం కూడా స్థానికంగా లేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలి.

అంధులతో చెస్ ఆడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అంధత్వం లోపం కాదు

ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్.రాజు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంధత్వం కేవలం శరీరానికి మాత్రమే ఉంటుందని.. అది ఎలాంటి లోపం కాదని ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్.రాజులు తెలిపారు. అనంతపురం నగరంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంధుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చదరంగం, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. అంధులతో కలిసి చెస్ ఆడి వారిని ప్రోత్సహించారు. సకలంగులకు ఏమాత్రం తీసిపోకుండా అంధులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు.

త్వరలో మోడల్ డీఎస్సీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా పట్టణంలో త్వరలో మోడల్ డీఎస్సీ నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ బద్దే నాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని కళ్యాణదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న డీఎస్సీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకో వాలని కోరారు. మోడల్ డీఎస్సీ పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించిన వారికి రూ. 20వేలు, ద్వితీయ ర్యాంక్‌కు రూ. 15వేలు, తృతీయ ర్యాంక్‌కు రూ. 10వేలు, 4 నుంచి 50 ర్యాంక్ సాధించిన వారికి నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. మోడల్ డీఎస్సీ పరీక్ష నిర్వహణ తేదీని త్వరలో తెలియజేస్తామన్నారు. వివరాలకు 94939 76058, 94918 34267, 80080 20250 సంప్రదించగలరు.

ఎమ్మెల్యే అమిలినేనికి ఆర్డీవో శుభాకాంక్షలు

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్డీవో

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా గురువారం ఆర్డీవో వసంతబాబు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకి ఆర్డీవో పూలబొకే ఇచ్చి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-డి.హీరేహాల్

స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో గురువారం విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహం చేయడం వల్ల కలిగే దుష్పరిణామాలను, బాల్య వివాహ చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి : యుటిఎఫ్

ప్రజాశక్తి-బొమ్మనహాల్

కూటమి ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ నాయ కులు గోవిందరాజులు డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 117 జీవో రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు బకాయి డిఎ, ఐఆర్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడలో ఈ నెల 5, 6, 7, 8 తేదీల్లో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవాల మహాసభలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాఘవేంద్రరావు, ఆంజనేయులు, మండల అధ్యక్షురాలు వాణి, రామలింగాదేవి, నాగరాజు, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

రాగి వైరు చోరీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మండలంలోని గూనిపల్లి గ్రామ జగనన్న కాలనీలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరు ఎత్తుకెళ్లారు. ఇటీవల కాలంలో పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైన విషయం విదితమే. వరుస ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలతో బాధిత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పోలీసులు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడిన నలుగురిని అరెస్టు చేశారు. అయినా చోరీలు మాత్రం ఆగడం లేదు. గతంలో పంట పొలాల్లో చోరీకి పాల్పడే దుండగులు ఇప్పుడు ఏకంగా మున్సిపాలిటీ పరిధిలో చోరీలకు పాల్పడడం చర్చనీయాంశంగా మారింది. ఇకనైనా పోలీస్ అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై ప్రత్యేకత దృష్టి ఉంచి దొంగలను పట్టుకోవాలని రైతులు, పట్టణ వాసులు కోరుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గూనిపల్లి జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం ఘటనపైప కాలనీవాసుల ఫిర్యాదు మేరకు పోలీసులు, స్థానిక విద్యుత్ శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

దుర్గంలో రోడ్డుపైనే వ్యాపారాలు

రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో రోడ్డుపైనే కూరగాయల వ్యాపారాలు నిర్వహిం చడం వల్ల పాదచారులు, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనికి తోడు మార్కెట్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా గల దుకాణాలు, ఇళ్ల ముందు మెట్లు, కట్టలు, ర్యాంపులు ఏర్పాటు చేయడం వల్ల రోడ్డు మరింత ఇరుకైంది. పురపాలక సంఘం గతంలో చిన్న మధ్య తరహా పట్టణాల అభివృద్ధి పథకం కింద కోటి రూపాయలకు పైగా వెచ్చించి కూరగాయల మార్కెట్‌లో 56 గదులు, 40 ఓపెన్ ఫ్లాట్ ఫారాలు ఏర్పాటు చేసింది. మార్కెట్ ఆవరణలో విశాలమైన ఖాళీ స్థలం ఉంది. మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు చుట్టూ అన్ని వైపులా 7 గేట్లు ఉన్నాయి. అయినప్పటికీ కనీసం 30 నుంచి 40 మంది చిరు వ్యాపారులు మార్కెట్ ప్రహరీ బయట రోడ్డుపై కూరగాయల గంపలు పెట్టి కొని వ్యాపారం

రాకపోకలకు ఇబ్బందులు

చేస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుపైనే కూరగాయల లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటారు. ప్రతి గురువారం పార్వతి నగర్ వద్ద వారపు సంత జరుగుతుంది. దీంతో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 7.30 గంటల వరకూ ఓబుళాచారి రోడ్డులో మార్కెట్ నుంచి దాసప్ప రోడ్డు క్రాసింగ్ వరకూ వ్యాపారాలు నిర్వహిస్తారు. ఆ సమయంలో పాదచారులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదంగా తెలిసినా మున్సిపల్ అధికారులు, కానీ పాలకమండలి సభ్యులు కానీ, ట్రాఫిక్ పోలీసులు కానీ ఈ విషయమై దృష్టి సారించడం లేదని చెప్పవచ్చు. గత నెలలో జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఎక్స్ అఫిషియో సభ్యులుగా హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కూడా పట్టణంలోని మెయిన్ బజార్‌లో రోడ్డుపైనే కూరగాయల వ్యాపారాలు కొనసాగడం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని ప్రస్తావించారు. ఈ వ్యాపారాలను మరో చోటికి తరలించడం వల్ల సమస్య కొంతవరకు చక్కబడుతుందన్నారు. ఈ విషయమై పురపాలక మండలి, మున్సిపల్, పోలీసు అధికారులు ఆలోచించి అవసరమైన చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

27 నుంచి జాతీయ లఘు చిత్రాల పండుగ

అనంత వేదికగా కార్యక్రమాలు

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-అనంతపురం

జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు వారం రోజుల పాటు అనంత వేదికగా 7వ అనంత జాతీయ లఘు చిత్రోత్సవ వేడుకలు జరగనున్నాయి. అనంతపురం ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ విజన్ ఇండియా, జిఎంసి గ్యాలరీ ఫిల్మ్స్ సహాయ సహకారాలతో లఘు చిత్రాల పోటీలు, ప్రదర్శన జరగనుంది. ఈ కార్యాక్రమానికి సంబంధించిన గోడ పత్రికను అనంతపురం ఫిల్మ్ సొసైటీ కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. జిఎంసి గ్యాలరీ ఫిల్మ్స్ ఆధినేత సురేష్, 'ప్రాక్సో ఆప్' ఆధినేత ముడార్ సుధీర్, డిస్కవరీ అనంతపురం అనిల్ కుమార్, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ మురళీధర్ రావు, ఎన్ఆర్ఐ కాలేజ్ ఆధినేత విశ్వనాథరెడ్డి, తోట బాలన్న, తోట భరద్వాజ్, యాంకర్ రమేష్, డిసిఐసి ప్రెసిడెంట్ రవీంద్రనాథ్ రెడ్డి, కెవి.రమణ (మీనాక్షమ్మ ఫౌండేషన్), వీర రాఘవ రెడ్డి, చిత్ర దర్శక, నిర్మాత రషీద్ బాషాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంత జాతీయ లఘు చిత్రోత్సవం పోటీల కోసం లఘు చిత్రాలను ఆహ్వానిస్తున్నట్లు వారు తెలిపారు. నటీనటులు, దర్శక నిర్మాతలు వారు రూపొందించిన లఘు చిత్రాలను జనవరి 20వ తేదీలో నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికైన 18 విభాగాల పరిధిలో ఫిబ్రవరి 2వ తేదీన అనంతపురం జిల్లా వేదికగా మెమోంటోలు, సర్టిఫికెట్లు అందించి సత్కరించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 7288022467, 9676350681 నెంబర్లను సంప్రదించాలని వారు తెలియజేశారు.

కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ దంపతులు, జాయింట్ కలెక్టర్

కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మీట్ అండ్ గ్రీట్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నూతన సంవత్సరం సందర్భంగా గురువారం నాడు కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆధ్వర్యంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ దంపతులు, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మలు నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఒ ఎ.మాలోల, డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, కలెక్టర్ కార్యాలయం ఏవో అలెగ్జాండర్ తదితరులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఒ అశోక్ కుమార్, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, జెడ్పీ సిఈవో ఆర్.రామచంద్ర రెడ్డితో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో 'అధికార' పెత్తనమేంటి : సిఐటియు

బొమ్మనహాల్ : మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు కేవలం అధికార పార్టీ వారికేనా అని సిఐటియు నాయకులు ప్రశ్నిస్తున్నారు. సిఐటియు మండల కమిటీ నాయకులు మాట్లా డుతూ మండలంలో 33 గ్రామాలు ఉండగా 11 వేల ఎకరాల తుంగభద్ర ఆయకట్టు కింద వరి పంట సాగు చేశారన్నారు. ఉద్దేహాల్, శ్రీధరఘట్ట సొసైటీ కేంద్రాల పరిధిలోని అధికారులు కేవలం అధికార పార్టీ నాయకులు సిఫారసు చేసిన రైతుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తూ చిన్న, సన్న కారు రైతులను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. లింగదహాల్, కొలగానహల్లి, హరేసముద్రం, బొల్లనగుడ్డం, కురవల్లి గ్రామాల్లో వరి ధాన్యం ఎందుకు కొనుగోలు చేయలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు అధికార పార్టీ వారికే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సామాన్య రైతులకు వరి ధాన్యం కొనుగోలు చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కోఆపరేటివ్ సొసైటీ ఉద్దేహాల్ అధికారి హనుమంతరాయుడు ను వివరణ కోరగా కొనుగోలు చేస్తామని సమాధానం దాటవేశారు.

ఆకట్టుకున్న విద్య, వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని ఎపి ఆదర్శ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన విద్య వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. మండల విద్యాశాఖ అధికారి బి.రవినాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్య వైజ్ఞానిక ప్రదర్శనను గుత్తి సీఐ బి.వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతికతను సక్రమైన మార్గంలో వినియోగించుకోవాలని వాటిని దుర్వినియోగం చేసుకోవద్దఅన్నారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలలో జరిగే మోసాలకు బలి కాకూడదని వివరించారు. ప్రస్తుత సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రాజెక్టులో ఉండేలా తయారు చేయాలని తెలిపారు. అలాగే జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని పిలుపునిచ్చారు. గుత్తిలో జరిగిన ప్రదర్శనలో మూడు విభాగాలలో జిల్లాస్థాయికి ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.ఉషా, ఉపాధ్యాయులు శ్యామల ప్రతాప్, రాధిక, శ్రీధర్‌గౌడ్, గోపీ, కృష్ణా, శ్రీనివాసులు, శ్రీరామ్‌రెడ్డి, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది సందీప్, రవికుమార్, గంగానాయక్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో మండల వ్యాప్తంగా పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, కెజిబివి తదితర పాఠశాలలకు చెందిన విద్యార్థులు దాదాపు 50కిపైగా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఎంఇఒలు నవీద, లింగానాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వసుంధర, నీరజా, ఎస్‌వీఆర్ ప్రసాద్, ఓంకారేశ్వర్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి సైన్స్ విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో విజేతలు జిల్లా స్థాయిలో పాల్గొంటారని ఎంఇఒలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి, ప్రధానోపాధ్యాయులు సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం మండల స్థాయి సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులు వివిద రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారు జిల్లాస్థాయిలో పాల్గొంటారని ఎంఇఒ శ్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో విద్యార్థినులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న సిఐ వెంకటేశ్వర్లు

ఉరవకొండ : విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను తీయడమే ధ్యేయమని మండల విద్యాశాఖ అధికారులు ఈశ్వరప్ప, రమాదేవి అన్నారు. గురువారం ఉరవకొండ మండల స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలను మండల కేంద్రంలోని జెడ్పి గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణితం సైన్స్ అంశాలకు సంబంధించి వారి నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ హైస్కూల్ హెడ్మాస్టర్ వి.అనితకుమారి, ఉపాధ్యాయులు సాకే భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని బండ్లపల్లి, పప్పురు, దుగుమర్రి గూగూడు, గడ్డంనాగేపల్లి, కెసేపల్లి, రంగాపురం గ్రామల్లో నిర్వహించిన గ్రామసభలు సజావుగా జరిగాయి. ఆయా గ్రామసభల్లో ఎంపిడిఒ గంగావతి, ఇఒఆర్‌డి శైలజారాణి, సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రీసర్వే గ్రామాల్లో రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.బాలరంగయ్య

సమస్యలపై నిలదీస్తున్న ఎం.బాలరంగయ్య

ప్రజాశక్తి-శింగనమల

మండలంలో రీ సర్వే చేసిన గ్రామాల్లో నెలకొన్న రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపి కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బాల రంగయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని రాచేపల్లిలో నిర్వహిం చిన రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రీ సర్వే చేసిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పి నెంబర్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అంతేగాకుండా రీసర్వే వల్ల రైతులకు చాలా అన్యాయం జరుగుతోందన్నారు. కావున వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహాశీల్దార్ ప్రకాష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం మండల అధ్యక్షుడు కొండారెడ్డి, శ్రీనివాసులు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

కమిషనర్ సబ్బి శివరామకృష్ణ, డీఎస్పీ రామకృష్ణుడు

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ

ప్రజాశక్తి-తాడిపత్రి

బాల్య వివాహాలను నివారించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ, డీఎస్పీ రామకృష్ణుడు తెలిపారు. గురువారం పట్టణంలోని నందలపాడు ఎపి మోడల్ స్కూల్ వద్ద సిడిపిఒ సాజిదాబేగం అధ్యక్షతన కిషోర్ వికాసం-బాల్య వివాహ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘిక దురాచారం అన్నారు. బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం బాల్య వివాహాలపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుమన్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అక్బర్ ఐ ఆసుపత్రిలో నూతన సంవత్సర వేడుకలు

డాక్టర్ అక్బర్ కంటి ఆసుపత్రిలో కేక్ కోస్తున్న డాక్టర్ అక్బర్ కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

డాక్టర్ అక్బర్ కంటి ఆస్పత్రిలో నూతన సంవత్సర వేడుకలు డాక్టర్ అక్బర్ సాహెబ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అక్బర్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో అందరూ కొత్త అవకాశాలను పుచ్చుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కొత్త సంవత్సరంలో కొత్త కొత్త విషయాలను నేర్చుకుంటూ విజయాలను సాధించాలని సూచించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ అక్బర్ సతీమణి బోనాల జహీదా అక్బర్, డాక్టర్ మిథున, డాక్టర్ షాజియా, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

ఎపి మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొంది నూతన సంవత్సర క్యాలెండర్ జిల్లా వైద్య శాఖ అధికారిణి ఎబి.దేవి ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ ఇబి.దేవి మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ల సెలవలపై త్వరలోనే సర్క్యులర్ అందచేస్తామన్నారు. అసోసియేషన్ సర్వీస్ ప్రజలకు ఎంతో ఉపయోగపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు అనుపమ జేమ్స్, డిపిఎంఒ డాక్టర్ రవిశంకర్, జిల్లా మలేరియా అధికారి ఓబులు, జిల్లా పరిపాలనాధికారి గిరిజ మనోహర్, నారాయణస్వామి, త్రినేత్ర హాస్పిటల్ అధినేత దాదాగాంధీ, ఎపి ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీధర్‌బాబు, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు సుదర్శన్, మధుబాబు, మస్తాన్, అరుణకుమారి, తనూజ, సుజాత, లలిత తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆల్‌మేవా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ముందుగా ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా సిఎం చంద్రబాబు ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలకు రూ.4300 కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు. అలాగే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా ఆల్‌మేవా కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్‌మేవా నాయకులు షేక్షావలి, ఫారూక్, ఫక్రుద్దీన్, హిదాయతుల్లా, జీలాన్ అష్రాఫ్, జాకీర్ సర్దార్, మసీవుల్లా, టిడిపి మైనార్టీ నాయకులు ఫిరోజ్, ముక్తియార్, తదితరులు పాల్గొన్నారు.

జెడిఎను కలిసిన వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నేతలు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మను జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల జిల్లా సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా యు.ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ అధికారులు అందరూ బాగా పని చేసి వ్యవసాయశాఖకు మంచి పేరు ప్రఖ్యతులు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి బ్యాళ్ల మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం మాజీ జిల్లా కార్యదర్శి గంగులప్ప, మాజీ జిల్లా కార్యదర్శి రామన్న, మాజీ జిల్లా కోశాధికారి శ్వేత, సంఘం సభ్యులు ఆదినారాయణ, రాము, షరీఫ్, సునీత, సుజిత, శైలజ, రంజిత, గంగులయ్య, వీరాంజనేయులు, పవన్, తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని చదివితేనే జీవితాలు ప్రభావితం

ప్రజాశక్తి-అనంతపురం

సమాజాన్ని చదివినప్పుడే జీవితాలు ప్రభావితం అవుతాయని ప్రముఖ రచయిత్రి సుమన జయంతి సూచించారు. నూతన సంవత్సర సందర్భంగా గురువారం నగరంలోని విశాలాంధ్ర బుక్‌హౌస్ వద్ద తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలుగు వెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమన జయంతి మాట్లాడుతూ మాతృభాషను ఎంతగా ప్రేమిస్తున్నామో.. పరభాషలనూ అంతే గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో అరసం ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, అనంత సాహిత్య ప్రస్థానం అధ్యక్షులు గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, ప్రముఖ కవులు అంకే రామలింగయ్య, ఎంఎన్ బృంద, రియాజుద్దీన్, ఆశ్రయ అనాథాశ్రమం నిర్వాహకులు ఎర్రగుంట్ల కృష్ణారెడ్డి, ఫైట్ ఫర్ రైట్స్ నాయకులు కెపి.రాజు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు కె.అల్తాఫ్, ఎస్.పరమేశ్వరరావు, కెఎల్ఎన్.ప్రసాద్, శంకర్, సాకే.సుధాకర్, ఎం.సాంబశివుడు, కె..సుబ్బరాయుడు, మీనా, జయరాములు, చెట్ల. ఈరన్న, బాలయ్య, టి.ఎన్. రసూల్, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

ఏడునెల్లలో రూ.60 లక్షల సిఎంఆర్ఎఫ్ నిధులు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఏడు నెలల్లోనే సిఎంఆర్ఆఫ్ కింద దాదాపు రూ.60 లక్షల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. గురువారం నగరంలోని నియోజకవర్గ కార్యాలయంలో ఆరుగురు బాధితులకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించకుండా ప్రయివేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన చికిత్సలు పొందిన వారు సిఎంఆర్ఎఫ్ కింద దరఖాస్తు చేసుకుంటే ఆర్థికసాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, మహిళా నాయకురాలు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కోటంక చెరువుకు నీరివ్వాలి

రైతుసంఘం ఆధ్వర్యంలో ఎస్ఇ కార్యాలయం ముందు ధర్నా

జలవనరుల ఎస్ఇకి వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

గార్లదిన్నె మండలం కోటంక చెరువుకు పిఎబిఆర్ నుంచి నీరు ఇవ్వాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం నగరంలోని జల వనరుల శాఖ ఎస్ఇ కార్యాలయం వద్ద రైతులతో కలిసి రైతుసంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ కూడేరు మండలం పొట్టిచెరువు నుంచి కోటంక వరకూ కాలువ తీశారన్నారు. ప్రస్తుతం కోటంక, మర్తాడు, తాటిచెర్ల గ్రామాల్లో భూగర్భజలాలు తగ్గిపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఈ సమయంలో కోటంక చెరువుకు నీరిస్తే ఆయా ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. కావున వీలైనంత త్వరగా కోటంక చెరువుకు నీరివ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఇకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, ఉపాధ్యక్షులు బిహెచ్.రాయుడు, నాయకులు నారాయణరెడ్డి, నాగార్జునరెడ్డి, పెద్దన్న, అంజి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా వి.శశిధర్‌రెడ్డి

వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులుగా వి.శశిధర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఎపి వ్యవసాయ ఉద్యోగుల సంఘం, జిల్లా నాయకుల సమక్షంలో గురువారం అనంతపురంలోని వ్యవసాయ అధికారుల సంఘం కార్యాలయంలో ఉన్న కృషి భవన్‌లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడితోపాటు కార్యదర్శిగా వివిఎస్ నరసింహ, సహాధ్యక్షులుగా బి.ఆనందరాజు, జిల్లా కోశాధికారిగా డి.అదిల్‌బాషా, జిల్లా ఉపాధ్యక్షులుగా ఆర్.ఆంజనేయులు, నారాయణస్వామి, శివకుమార్, రామలింగారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఎ.నాగభూషణం, హెచ్.అనిల్, కె.రాజేష్, ఎ.మోహన్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా వి.రాజ్యలక్ష్మి, ఎస్ఇఎం ఖాద్రీ, జిల్లా ఇసి సభ్యులు లీలావతి, ఎ.వెంకటేశ్వర్లు, కె.రహంతుల్లా, రాష్ట్ర ఇసి సభ్యులుగా శశికళ, బి.హేమంతుకుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఉద్యోగుల సమావేశం రాష్ట్ర అధ్యక్షులు టివి.రామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ వి.రఘురామనాయుడు, రాష్ట్ర కోశాధికారి దొగురు శ్రీహరి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ హెచ్.రూపేష్‌కుమార్, బి.ఆనందరాజు, బి.సురేంద్ర, సంయుక్త కార్యదర్శి పి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో 'కాసం ఫ్యాషన్స్' ప్రారంభం

హాజరైన సినీనటి అనసూయ భరద్వాజ్

ప్రజలకు నమస్కరిస్తున్న నటి అనసూయ

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలో ఏర్పాటు చేసిన కాసంఫ్యాషన్స్ 16వ స్టోర్‌ను సినీనటి అనసూయ భరద్వాజ్ గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అనసూయ మాల్‌లోని లేడీస్, జెంట్స్, కిడ్స్‌వేర్ అంతా కలియతిరిగి సందడి చేశారు. అనసూయను చూడడానికి అభిమానులు, పరిసర ప్రాంత యువకులు ఉదయం నుంచి బారులుదీరారు. యువతీ, యువకుల కేరింతలతో షాపింగ్ మాల్ ప్రాంతంలో కోలాహలం నెలకొంది. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ అధునాతన కలెక్షన్స్‌తో నిత్య నూతన వెరైటీలతో కాసం ఫ్యాషన్స్ పేరు గాంచిందన్నారు. అలాంటి స్టోర్‌ను తాడిపత్రిలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తాడిపత్రి చుట్టు పక్కల ప్రాంత వాసులు కాసం ఫ్యాషన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో గత 4 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటి వరకూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 15వ స్టోర్‌ను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈకార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, ప్రముఖులు కంచన్ పుల్లారెడ్డి, కాకర్ల రంగనాథ, కౌన్సిలర్ అరుణ, మడ్డిపల్లి జనార్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కాసం ఫణి, కాసం సాయికృష్ణ, కాసం ధీరజ్, డాక్టర్ కాసం ప్రీతం, యాంసాని ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

అరటి గెలలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు

యాడికి : నూతన సంవత్సరం సందర్భంగా యాడికి తహశీల్దార్ ప్రతాపరెడ్డితో పాటు మండలంలో అరటి సాగు రైతన్నలు గురువారం జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అరటి గెల అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా యాడికి తహశీల్దార్ కార్యాలయ భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దిన తహశీల్దార్ ప్రతాపరెడ్డి, సిబ్బంది, అరటిలో అధిక దిగుబడి సాధించిన యాడికి మండల అన్నదాతలను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ కిష్టప్ప, రెవెన్యూ సిబ్బంది, రైతన్నలు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

యాడికి : సూఫీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కర్నూలు శాంతిరామ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న అమీనా ఆప్టికల్స్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 16 మందికి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అమీనా ఆప్టికల్స్ యజమాని సయ్యద్ సూఫీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

బెలుగుప్పలో ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి

బెలుగుప్ప : మండల కేంద్రంలోని ఇంటర్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని బెళుగుప్పలోనే ఏర్పాటు చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం అనంతపురంలోని కార్యాలయంలో ఆర్ఐఒ వెంకటరమణనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాధాజ్యోతి, వంశీ, జిల్లా సహాయ కార్యదర్శి చందు, రాష్ట్ర సమితి సభ్యులు లలిత, నాయకులు చిట్మా, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

యల్లనూరు : మండల పరిధిలోని 85 నిట్టూరు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను ఎంపిడిఒ వాసుదేవరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాణ్యతతో కూడిన పనులను చేయించాలన్నారు. అలాగే రోజూ పని ప్రదేశానికి వచ్చిన కూలీలను మాత్రమే హాజరు పట్టిలో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ షబ్బీర్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

సిబ్బందితో సమావేశం

మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది వారంతపు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

ప్రజాశక్తి క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని జిల్లా జడ్జి శ్రీనివాస్, కలెక్టర్ వినోద్‌కుమార్ గురువారం వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికా రంగంలో భిన్నమైన ప్రణాళికలు, విలువలతో ప్రజల పక్షాన ముందుకెళ్తున్న ఏకైక పత్రిక ప్రజాశక్తి అని కొనియాడారు. ఆ పత్రికలో పని చేస్తున్న సిబ్బంది సైతం విలువలకు కట్టుబడి నిబద్ధతతో పనిచేయడం అభినందించదగ్గ విషయమన్నారు. ఉన్నతమైన ఆశయాలతో నడపబడుతున్న ప్రజాశక్తి మరింత అభివృద్ధి చెంది ప్రజల పక్షాన నిలబడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి అనంతపురం ఎడిషన్ మేనేజర్ వేణుగోపాల్, మురళి, రవిచంద్ర, రామాంజనేయులు, తిమ్మప్ప, గిరి, తదితరులు పాల్గొన్నారు.

వేమన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-గుత్తి

మహాకవి వేమన విగ్రహాన్ని గుత్తి పట్టణంలో ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని వేమారెడ్డి సంక్షేమ సంఘం నాయకులు పి. వెంకటరామిరెడ్డి, వై.రాజశేఖర్ రెడ్డి కోరారు. వేమారెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం స్థానిక పట్టణంలోని ఆర్‌అండ్ బి అతిథి గహంలో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేమన జయంతి,వర్ధంతిని సెలవు దినంగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో వేమారెడ్డి సంక్షేమ సంఘం నాయకులు వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి,టి.తిమ్మారెడ్డి, కాంతారెడ్డి, బి.జయరామిరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, సీతారామిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, నరేంద్ర రెడ్డి, హరినాథ్‌రెడ్డి, గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

'విశ్వ'ను విమర్శించే స్థాయి ఎంపిపికి లేదు..

ప్రజాశక్తి-బెలుగుప్ప

వైసిపి బీఫారంపై గెలిచిన ఎంపిపి పెద్దన్న పదవిని అనుభవిస్తూ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డిని విమర్శించడం తగదని వైసిపి నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వైసిపి నాయకుడి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు శ్రీనివాసులు, జి.శ్రీనివాసులు, చిన్న మచ్చన్న మాట్లాడుతూ ఎంపిపి పెద్దన్న కన్న తల్లిలాంటి పార్టీని అవమానించి విశ్వేశ్వర్‌రెడ్డిని విమర్శించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా పెద్దన్న తన స్థాయిని తెలుసుకుని మాట్లాడాలని, లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వీరబ్రహ్మన్న, శీర్పి శంకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, పాతన్న, బాబురెడ్డి, చెక్కే తిప్పేస్వామి, ఎర్రగుడి ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

అర్హులైన పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండుసెంట్ల ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కూడేరులోని విఘ్నేశ్వర కాలనీలో పేదల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేకమంది పేదలకు స్థలాలు, ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి అర్హులందరికీ స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.కేశవరెడ్డి, వ్య.కా.సం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు నాయకులు మల్లిఖార్జున, నారాయణమ్మ, పార్వతీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల భర్తీకి దరఖాస్తు చేసుకోండి

డిఎంహెచ్ఒ డాక్టర్ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం

వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం కడప జోన్-4 పరిధిలో 150 స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ ఇబి.దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించి దరఖాస్తు నమూనా, ఇతర వివరాలను http:cfw. ap. gov. in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తును వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకుని భర్తీ చేసిన దరఖాస్తుతోపాటు నిర్దేశించిన దరఖాస్తు రుసుం, సర్టిఫికెట్లను జతపరిచి నేటి నుంచి వచ్చేనెల 17వతేదీలోపు దరఖాస్తులను ప్రాంతీయ సంచాలకులు, వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం, కడపలో అందజేయాలని కోరారు.

శింగనమల ఎస్ఐగా విజయ్‌కుమార్

ప్రజాశక్తి-శింగనమల

మండల నూతన ఎస్ఐగా విజయ్‌కుమార్ గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న శరత్‌చంద్ర బదిలీ కావడతో ఆయన స్థానంలో విజయ్‌కుమార్‌ను నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. తర్వాత సిఐ కౌలట్లయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా గ్రామాల్లో శాంతి భద్రతలకు కృషి చేస్తామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించినా, ఇసుకను అక్రమంగా తరలించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాకాకుండా చిన్న చిన్న తగాదాలకు గొడవలకు పాల్పడితే కేసులు నమోదై జీవితాలు నాశనం అవుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

బదిలీ ఎస్ఐకు సన్మానం

పుట్లూరు : మండల ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై తిరుపతికి వెళ్లిన హేమాద్రిని గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐ సత్యబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజశేఖర్ హెడ్ కానిస్టేబుల్ మధు, శామ్యూల్, కానిస్టేబుల్ శంకర, రమణ, అల్తాఫ్, వెంకట్ నాయుడు, రంగా తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రివర్గ నిర్ణయాలపై హర్షం

అనంతపురం : కూటమి ప్రభుత్వం గురువారం నిర్వహించిన మంత్రుల సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలపై ఎపి పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులకు కేంద్రం ఇస్తున్న రూ.10వేలతోపాటు రాష్ట్రం కూడా మరో రూ.10వేలు కలిపి ఇవ్వాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. అలాగే మత్స్యకారులకు హాలిడే అప్పుడు రూ.20వేలు అందించాలని తెలపడంతో బీసీ బిడ్డలైన మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అలాగే తిరుపతి ఇఎస్ఐ ఆసుపత్రిని వంద పడకలు ఆసుపత్రిగా చేయాలనే నిర్ణయం కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం పక్షపాతిగా నిలిచిందన్నారు. రాబోయే అకాడమిక్ ఇయర్ నుంచి 'తల్లికివందనం' చదివే ప్రతి పిల్లవాళ్లు, ఇంట్లో ఒక్కరికి కాదు ఎంతమంది ఉన్నా అందరికి అమలు చేస్తామని తెలపడం శుభపరిణామమన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలపై నిరసన

ప్రజాశక్తి-ఉరవకొండ

నెలనెలా సక్రమంగా రేషన్ బియ్యం అందించాలని కోరుతూ పట్టణంలోని 10వ వార్డుకు చెందిన మహిళలు గురువారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఆరు నెలలుగా సక్రమంగా రేషన్ బియ్యం అందడం లేదన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రతినెలా సక్రమంగా రేషన్ ఇచ్చేంత వరకూ వెళ్లేదిలేదని భీష్మించుకుని కూర్చున్నారు. విషయం తెలుసుకున్న ఉప తహాశీల్దార్ భోగన్నగౌడ్ ఫోన్లో మహిళలతో మాట్లాడి ఇక నుంచి నెలనెలా సక్రమంగా రేషన్ బియ్యం అందజేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఎద్దుల బండిని తొలగించాలని వినతి

యాడికి : మండల పరిధిలోని తూట్రాలాపల్లి గ్రామంలో రహదారికి అడ్డంగా ఉంచిన ఎద్దులబండిని తొలగించాలని గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ వీర్రాజుకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తూట్రాళ్లపల్లికి చెందిన వెకటనాగిరెడ్డి మాట్లాడుతూ తమ ఇంటి ఎదురుగా ఉన్న ఆదిరెడ్డి, లక్ష్మీరెడ్డి ఇంటి బయట రాళ్లు, ఎద్దులబండి ఉంచారన్నారు. వారం క్రితం కోర్టు ఆదేశాల మేరకు అడ్డుగా ఉన్న రాళ్లు, ఎద్దుల బండిని ఎంపిడిఓ వీర్రాజు, ఎస్ఐ సమక్షంలో తొలగించినా తిరిగి మళ్లీ వేశారని తెలిపారు. వెంటనే ఎద్దుల బండిని తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఉరవకొండ : గ్రామ పంచాయతీల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపిపి వెలుగొండ నరసింహులు కోరారు. గురువారం పట్టనంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచి మీనుగా లలిత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామసభల ద్వారా ప్రజాప్రణాళికలు రూపొందించుకుని అభివృద్ధి చేయాలన్నారు. ముఖ్యంగా అనేక ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. అనంతరం ఉపాధి, ఆరోగ్యం, తాగునీరు, వ్యవసాయం, ప్రజారక్షణ, తదితర అనేక అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గౌస్‌సాహెబ్, వార్డు సభ్యులు నిరంజన్‌గౌడ్, ప్రభాకర్, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రికల్చర్ ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం : ఎపి అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రూపొందించిన ఉమ్మడి జిల్లా నూతన క్యాలెండర్‌ను జిల్లా వ్యవసాయ అధికారి యు. ఉమామహేశ్వరమ్మ గురువారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపి అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.రాజేంద్రప్రసాద్, బాలాజీనాయక్, కార్యవర్గ సభ్యులు రమణారెడ్డి, ప్రానేష్, రాజగోపాల్, నరసింహులు, సల్మా, పద్మావతి, వీరేష్, హాఫీజ్, శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్ : పైప్‌లైన్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం నగరంలో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు కమిషనర్ రామలింగేశ్వర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌కు బళ్లారి బైపాస్ సబ్‌స్టేషన్ వద్ద ఏర్పడిన లేకేజీలకు మరమ్మతులు చేసేందుకు నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని నగర ప్రజలు గమనించాలని కోరారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులు

యల్లనూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గురువారం మండల కేంద్రంలో ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా ఇటీవల ఎన్నికైన పాఠశాలల ఎస్ఎంసి ఛైర్మన్, ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బంగారు దుకాణంలో చోరీ

మహిళను పట్టుకుని పోలీసులకు అప్పగింత

నార్పల : మండల కేంద్రంలోని సంత బజారులో ఉన్న సయ్యద్ బంగారు దుకాణంలో గురువారం మధ్యాహ్న గడ్డంనాగేపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ జత కొమ్మలను కొట్టేసింది. సదరు మహిళ కమ్మలు కొనే నెపంతో పలురకాల కమ్మలను చూపించమని చెప్పింది. ఇందులో భాగంగా దుకాణ యజమాని కమ్మలు చూపిస్తుండగా మహిళ తనతోపాటు తెచ్చుకున్న రోల్డ్ గోల్డ్ కమ్మలను దుకాణదారుని బాక్సులో వేసి నిజమైన బంగారు కమ్మలను చోరీ చేసింది. కమ్మలు చోరీ అయినట్లు గమనించిన దుకాణ యజమాని సయ్యద్, కుమారుడు గుర్తించి మహిళను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.